క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం. లక్ష్మీపతిరావు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలి



తెనాలి అర్బన్: పండ్ల మార్కెట్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. బుధవారం మార్కెట్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను దగ్గరుండి పరిశీలించారు. ప్రతిరోజు కాలువలను బాగు చేయాలని.. వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



తెనాలి అర్బన్: దంతాలను ప్రతి రోజు శుభ్రం చేసుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ కడియాల పల్లవి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు పేర్ల వసంతలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకుని నాజరుపేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆమె దంత పరీక్షలు చేసి బ్రష్, పేస్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు లయన్ నేరెళ్ల వెంకట కృష్ణ మోహనరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, నంబూరు శ్రీకుమార్, కొణిజేటి రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ లేని ఆహార పదార్థాలను ఉపయోగించాలి



తెనాలి అర్బన్: కల్తీ లేని ఆహార పదార్థాలను అందరూ ఉపయోగించాలని మున్సిపల్ సిటీ ప్లానర్ వాణి, మెప్మా సీఎంఎం విజయకుమారి పేర్కొన్నారు. నెస్లే ఇండియా సంస్థ సహకారంతో బుధవారం అయితానగర్‌లోని కొత్తమాసు తులసీదాస్ కమ్యూనిటీ హాల్‌లో వీధి వ్యాపారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరు వ్యాపారులు తమ బండ్ల వద్ద శుభ్రత ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వసీం అహ్మద్, ఎంఆర్ మూర్తి, నారాయణ, కామేష్, బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం



ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలోని సబ్ సెంటర్లో బుధవారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ మాట్లాడుతూ బోరునీటి వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. జంక్‌ఫుడ్‌లు తినకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. దీనిద్వారా ఫ్లోరోసిస్‌ను నియంత్రించవచ్చని చెప్పారు. హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, సీహెచ్‌ఓ బాలకీర్తి, ఏఎన్ఎం మాధురి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతన్నలూ.. పాములతో జర భద్రం!

- పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రమాదానికి గురైతే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి



కొల్లిపర: వర్షాకాలం వచ్చిందంటే పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు ఈ సందర్భంలో అప్రమత్తంగా ఉండాలి. జులై నుంచి సెప్టెంబర్ వరకూ పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలు ఎక్కువగా పొలాల గట్లమీద, చేలల్లో తిరుగుతుంటాయి. పొలాలు, గడ్డి, చెత్త కుప్పల్లో ఉండే కప్పలు, ఎలుకలను తినేందుకు తరచూ ఇవి వస్తుంటాయి. రాత్రి సమయంలో అటు వైపు ఎవరూ వెళ్లకపోవడం మంచిది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. లైటు వేసుకుని చుట్టు పక్కలను క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లాలి. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పిచ్చిమొక్కలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి.

నాటు వైద్యం వద్దు..

ప్రమాదవశాత్తు ఎవరైనా పాము కాటుకు గురైతే నాటు వైద్యం, మంత్రాలను ఆశ్రయించకూడదు. గోల్డెన్ అవర్‌లో వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలకు పాము కాటుకు గురైన వ్యక్తిని తరలించాలి. పాము కాటు విరుగుడుకు వైద్యులు యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్ ఇస్తారు. అయితే కొన్ని రకాల పాములు అత్యంత విషపూరితమైనవి ఉంటాయి. ఏ పాము కరిచినా వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు..



పాము కాటుకు గురైన వ్యక్తిని వెంటనే గోల్డెన్ అవర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలి. విష సర్పాలు కాటేసినప్పుడు నాటు వైద్యం, పసర్లు, మంత్రాల పేరిట కాలయాపన చేయకూడదు. ఆసుపత్రికి రాకుండా ఆలస్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. కొల్లిపర సీహెచ్‌సీలో పాము కాటుకు,(స్నేక్ వీనం ఇంజెక్షన్లు) కుక్కకాటుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు అపోహలు పెట్టుకోవద్దు.

– డాక్టర్ శ్రావణి, కొల్లిపర సీహెచ్‌సీ సూపరింటెండెంట్

పంటల బీమాపై రైతులకు అవగాహన



కశెవరంలో రైతులతో మాట్లాడుతున్న వైభవ్‌శర్మ

తెనాలి టౌన్: రూరల్ మండలంలో కశెవరం, ఎరుకలపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం పాల్గొంది. ఆ బృందంలో ఒకరైన వైభవ్‌శర్మ రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. తుఫాను, కరువు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడమే బీమా ఉద్దేశమని తెలిపారు. ఎంపిక చేసిన పంటలకు సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులు సహా రైతులందరూ ఈ బీమా పథకానికి అర్హులుగా చెప్పారు. ఆగస్టు 15లోగా రైతులందరూ ప్రీమియంను చెల్లించాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఏడీఏ కె.రాజకుమారి, మండల వ్యవసాయాధికారి సుధీర్‌బాబు, కశెవరం సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ కంపెనీ ప్రతినిధులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి



రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

కొల్లిపర: స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే నిలుపుదల చేయాలని.. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని పేరంటాలమ్మ దేవాలయం వద్ద బుధవారం స్మార్ట్ మీటర్లపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని నారా లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం దగ్గరుండి స్మార్ట్ మీటర్లు బిగించడం లోకేష్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో కరెంటు ఛార్జీల భారం తగ్గకపోగా మరింత పెరిగాయని ఆరోపించారు. కార్యక్రమంలో లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కేసరి మాధవరెడ్డి, బొట్ట ప్రసాదరెడ్డి, కొండ లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి పిచ్చిరెడ్డి, కొండ శివారెడ్డి, వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు డీలర్లు, వ్యాపారులను కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం స్టేషన్ పరిధిలోని పురుగు మందులు, ఎరువులు, విత్తనాల డీలర్లు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించే రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. వ్యాపారమే పరమావధిగా కాకుండా రైతు శ్రేయస్సు కూడా దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని కోరారు. రైతులను మోసగించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ ఎన్.ప్రకాశరావు, మండల వ్యవసాయ అధికారి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్



బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు

తెనాలి రూరల్: తెనాలి–గుంటూరు మార్గంలో చెంచుపేట ఓవర్ బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఓ కారును బ్రిడ్జి మధ్యలో అడ్డంగా నిలిపేయడంతో వాహనాలు నిలిచిపోయాయని స్థానికులు తెలిపారు. కారులో ఉన్న వారు మద్యం మత్తులో ఉండి.. ఓ ఆటో డ్రైవర్‌తో గొడవ పడినట్లు సమాచారం. సుమారు 20 నిముషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ సిబ్బంది అక్కడి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆగస్టు 3న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సన్నాహక సమావేశంలో సాయి లక్కరాజు ప్రభృతులు

తెనాలి: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీలో 1979–1982 బీకాం డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు 43 ఏళ్ల తర్వాత అదే కాలేజీలో ఆగస్టు 3 ఆదివారం ఉదయం ఆత్మీయ సమ్మేళనానికి నిర్ణయించారు. ఇందుకు సన్నాహకంగా నాటి పూర్వ విద్యార్థులు కొందరు బుధవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సమావేశమయ్యారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థి సాయి లక్కరాజు అధ్యక్షత వహించారు. 1979–82లో బీకాం చదివిన వీఎస్సార్ కాలేజీ విద్యార్థులు తప్పక హాజరు కావాలని కోరారు. చైతన్య గ్రామీణ బ్యాంక్ విశ్రాంత అధికారి కెనడి మాట్లాడుతూ.. కాలేజీ కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, గురువులు నన్నపనేని ముకుందరావు, కోడూరి మల్లికార్జునరావు, డాక్టర్ శివప్రసాద్, అల్లం సత్యనారాయణ, జానకిరామయ్య పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో కోటిరెడ్డి, శ్రీనివాసరావు, వంశీ శ్రీనివాస్, కడియాల సాంబశివరావు, శంకరరావు, రమేష్ బాబు, కౌముది, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పంపు ఏర్పాటు

తెనాలి అర్బన్: 'ఫర్ ది లీస్ట్ ఆఫ్ దెమ్ సంస్థ' ఆధ్వర్యంలో పరిమి రోడ్డులో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి పంపును త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రావూరి అంజలి, సినీ దర్శకుడు దిలీప్ రాజా, అచ్చన శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాళికా మాత విగ్రహ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమ్మ ఆశ్రమ సేవకులు

తెనాలి: అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ స్వామి జ్ఞానప్రసన్న ఆధ్వర్యంలో జిల్లాలోని ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలో 40 అడుగుల భూగర్భంలో 30 అడుగుల కాళికా దేవి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం త్వరలో జరగనుంది. పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వర భక్తబృంద సేవా సమితితో ఈ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అమ్మ ఆశ్రమ సేవకుడు అక్కల రమేష్ మాట్లాడుతూ.. వేమవరంలోని కోటిలింగాల క్షేత్రం ప్రాంగణంలో 40 అడుగుల లోతులో 30 అడుగుల కాళికా మాత విగ్రహాన్ని ప్రతిష్ట చేయనున్నారని తెలిపారు. కుర్రా శ్రీను మాట్లాడుతూ.. స్వామి జ్ఞానప్రసన్న సంకల్పంతో అయోధ్య మందిరం ప్రతిష్ట రోజునే కోటి ఒక్క లింగాల ప్రతిష్ట జరిగిందని గుర్తుచేశారు. భక్తులందరూ పాల్గొని ఉచితంగా ఇచ్చే రాగినాణెం, శ్రీచక్ర నాణెంతో నవధాన్యాలను ప్రతిష్ట పీఠంలో వేసి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని పెసర్లంక రమణ కోరారు. కార్యక్రమంలో నల్లగొర్ల నాగేశ్వరరావు, గాదె హనుమారెడ్డి, వేమ సురేష్, గాజులపల్లి ఆంజనేయులు, పెరుగు మల్లికార్జునరావు (పెద్దబాబు), మల్లెల వాసు, ఎస్ఆర్‌కే శర్మ, షేక్ మీరావలి, వేల్పుల గంగాధర్, బంగారు పోతురాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మహిళా పారిశుద్ధ్య కార్మికులపై లాఠీచార్జి దారుణం

ఉండవల్లి, పెనుమాకల్లో నిరసన తెలిపిన పారిశుద్ధ్య కార్మికులు



పెనుమాకలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తాడేపల్లిరూరల్: నెల్లూరులో మహిళా పారిశుద్ధ్య కార్మికులపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉండవల్లి, పెనుమాకల్లో బుధవారం ఖాళీ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటీఎంసీ రాజధాని ప్రాంత గౌరవ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ నెల్లూరులో మున్సిపల్ మహిళా కార్మికులపై లాఠీచార్జి చేసి బూటు కాళ్లతో తన్నిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను బానిసలుగా మార్చే వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గత 15 రోజుల నుంచి నెల్లూరు పట్టణంలో వర్క్ అవుట్ సోర్సింగ్ విధానానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టి విజయం సాధించిన మున్సిపల్ కార్మికులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. నెల్లూరులో పోరాట ఫలితంగా మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగిస్తామని, సమ్మె కాలపు వేతనం చెల్లిస్తామని, పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఐటీయూ నాయకులు వేణు, గురవయ్య, వల్లభాపురం వెంకటేశ్వరరావు, కుశలరావు, కార్మికులు మేరి, సుబ్బులు, స్వర్ణకుమారి, స్వరూప నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాడం ఆడవద్దని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు యాజమాన్యాన్ని కోరారు. బుధవారం నాటికి తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 239వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ కార్యదర్శి స్టీవెన్, కమిటీ సభ్యులు ఆదినారాయణతో కలసి వేముల దుర్గారావు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఫ్యాక్టరీ భూముల్లో ఎటువంటి కార్యకలాపాలు జరగనివ్వబోమని హెచ్చరించారు. పేద కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్య వైఖరి దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు హగ్గయ్య, పిచ్చయ్య, నాగమల్లేశ్వరి, వేముల లక్ష్మి, రమాదేవి, శికుమారి, దుర్గాభవాని, అంకయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాజధాని గ్రామాల్లో జోరుగా జూదం



నీరుకొండ వద్ద యథేచ్ఛగా కొనసాగుతున్న కోడి పందేలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పందెం కోడి తొడకొడుతోంది. అధికారులు, పోలీసులు నిఘా విభాగం నిద్రపోతుండటంతో యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట నిర్వహణ జోరుగా కొనసాగుతోంది. అధికార పార్టీకి చెందిన వ్యక్తులతోపాటు, గుంటూరు, మంగళగిరి, విజయవాడ, అమరావతి, సత్తెనపల్లి, తెనాలి ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు పందెంలో, పేకాటలో పాల్గొంటూ రూ. లక్షలు పోగొట్టుకుంటున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథులే కనిపించడం లేదు.

పందెం రాయుళ్ల క్యూ..

29 గ్రామాల పరిధిలోని తుళ్లూరు మండలం నెక్కల్లు, వడ్డమాను, పెదపరిమి, శాఖమూరు, తుళ్లూరు, వెలంగ్రాయనిపాలెం, ఉద్దండరాయునిపాలెం, లంక, మంగళగిరి రూరల్ మండలం నీరుకొండ, తాడికొండ మండలం మోతడక, కంతేరు, నిడుముక్కల, పాములపాడు, బండారుపల్లి, పలు గ్రామాల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. దీనిపై ఆయా విభాగాలకు చెందిన పెద్దలకు భారీగా ముడుపులు ముట్టజెబుతున్నామని, నిర్వాహకులు అభయం ఇస్తుండటంతో విజయవాడ, తదితర ప్రాంతాలకు చెందిన పందెం రాయుళ్లు క్యూ కడుతున్నారు. రోజూ యథేచ్ఛగా ఈ తంతు కొనసాగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువత లక్ష్యంగా కోడిపందేలు భారీగా కొనసాగుతున్నాయి. కోతముక్క ఆడేందుకు క్యూ కడుతున్నారు. ఇందుకు గాను రూ. లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం. కాగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్లాట్లకు దారి వదలండి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ గ్రామ పరిధిలోని వసంత లక్ష్మి నగర్‌లో వెంచర్‌లో కాలువ నిర్మాణంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ సర్వే నెం. 55/1లో ఏర్పాటైన ఈ కాలనీలో సుమారు 200 ప్లాట్లు అమ్మకం జరిగాయని, 76 ప్లాట్లు సీఆర్‌డీఏ లేఅవుట్ రెగ్యులర్ స్కీమ్ కింద మంజూరయ్యాయని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసినపుడు డాక్యుమెంట్లలో 33 అడుగుల రహదారి ఉన్నప్పటికీ, ఇటీవల ఓ రైతు అదే రోడ్డు మార్గంలో కాలువ తవ్వకాలు చేపట్టారని పేర్కొన్నారు. ఆరు అడుగుల విస్తీర్ణంలో కాలువ తవ్వుకోవాలని తహసీల్దార్ తెలియజేశారని, కానీ సదరు రైతు మాత్రం 20 అడుగుల మేర తవ్వడంతో ప్లాట్లకు రహదారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వ్యవసాయానికి, రైతులకు వ్యతిరేకం కాదని, ప్లాట్లకు దారి ఉండేలా వదిలి కాలువ నిర్మించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలి

తాడేపల్లిరూరల్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఆప్కాస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని మున్సిపల్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులతో పోలీసులు ప్రవర్తించిన తీరు అమానుషమని వ్యాఖ్యానించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు మేరి, శ్రీను, కామాక్షి, సుబ్బులు, నాని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తగలబెట్ట వద్దు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి వ్యర్థాలను దహనం చేయడం వల్ల వాహనదారులకు, పర్యావరణానికి సమస్యగా ఉంటుందని, స్థానిక పంచాయితీల అధికారులు, జీఎంసీ ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు, వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంబడి వ్యర్థాలు గుట్టలుగా వేసి, దహనం చేయడం తీవ్ర సమస్యగా ఉందని, వ్యర్థాలు వేసే వారిని ప్రత్యేక నిఘా పెట్టి అడ్డుకోవాలన్నారు. అవసరమైతే అపరాధ రుసుం విధించాలని పంచాయితీ, జీఎంసీ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. నగరంలోని డివిజన్ల వారీగా చెత్త తరలింపు కోసం వాహనాలు కేటాయించామని, శివారు ప్రాంతాల్లో చెత్త కుప్పలు ఉంటే సంబంధిత ఇన్‌స్పెక్టరే బాధ్యత వహించాలని హెచ్చరించారు. అనంతరం వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ ఎంపీడీఓ కె శ్రీనివాసరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వర శాస్త్రి, జీఎంసీ డీఈఈ వెంకటరమణ, టిడ్కో డీఈఈ సేతుబాబు, టిడ్కో కోఆర్డినేటర్ సుధాకర్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్వరం గృహ నిర్మాణాలు చేపట్టాలి



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ సచివాలయం పరిధిలోని 1,2 లేఅవుట్ల పరిధిలోని గృహ నిర్మాణాలను బుధవారం ఎంపీడీఓ శివ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేయని వారు ఇప్పటికైనా పూర్తి చేసేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు వీలుగా ప్రభుత్వం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ. 50వేలు అందిస్తున్నారన్నారు. అదేవిధంగా ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు ఇస్తున్నారని వీటితో లబ్ధిదారులు ఇంటినిర్మాణాలు పూర్తిచేయాలని చెప్పారు. గృహ నిర్మాణాల వద్ద ఉన్న పిచ్చికంపను తొలగించాలని సిబ్బందికి సూచించారు. మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీలు పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: కరోనా సమయంలో నిలిపివేసిన సీనియర్ సిటిజన్స్ రాయితీలను రైల్వే శాఖ పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంగా 2020లో కేంద్ర తాత్కాలికంగా నిలిపి వేసిన రైల్వే రాయితీలను కరోనా తగ్గు ముఖం పట్టి ఏళ్లు గడుస్తున్నా ఆ రాయితీలను పునరుద్ధరించక పోగా శాశ్వతంగా రద్దు చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి పి.భావన్నారాయణ మాట్లాడుతూ బ్రిటన్, కెనడా, జర్మనీ, జపాన్ దేశాలు వృద్ధుల ప్రయాణ అవసరాలను గుర్తించి ప్రత్యేక రాయితీలను కొనసాగిస్తున్నారని చెప్పారు.

